# "జంట!"

-టి.నీలం సంజీవ్,

ఆ రోజు మా కళాశాల కళకళ్ళాడ్తోంది! కారణం... ఎటుచూసినా కొత్త విద్యార్థులతో ఆవరణంతా సందడి సందడిగా ఉంది!

నేను ఆ రోజే మొదటిసారిగా కాలేజీకి వెళ్ళానేమో అక్కడున్న సీనియర్ల గుంపులను చూడగానే గుండె గుభేల్ మంది!

"దేవుడా! నన్ను వాళ్ళ రాగింగ్ బారిన పడేయకు" అనుకుంటూ బిత్తర చూపులతో తడబడే అడుగులతో ముందుకు నడిచాను సీతాకోక చిలుకల్లాంటి అమ్మాయిలతో, నూనుగుమీసాలు వచ్చిన అబ్బాయిలతో ఎటుచూసినా కాలేజీ అంతా కళకళ్ళాడ్తూ కోలాహలంగా ఉంది!

ఇంతలో నా దగ్గరికి ఓ సీనియర్ గ్రూపు వచ్చింది. వస్తూనే నన్ను ప్రశ్నల పరంపరతో చంపడం మొదలెట్టారు.

"నీకు నచ్చిన సినిమా-తార ఎవరు?" అడిగారు ఒకరు.

"ఖచ్చితంగా రమ్యకృష్ణ లేకపోతే రోజా" అన్నాడు మరొకడు.

వాణ్ణి ఊర్కోమని చెప్పి నా సమాధానం కోసమన్నట్టు అంతా నావైపు చూశారు.

నేను తడబడుతూనే "సౌ..ం...ద...ర్య..." అని చెప్పాను.

అందరూ గొల్లున నవ్వారు.

"పాపం ఎక్స్‌పోజింగ్ చేయదుకదా. అందుకీ మనోడికి నచ్చి ఉంటుంది, నయం .. రేవతి అన్లేదు" అంటూ నవ్వసాగారు.

మరొకడు ముందుకు వచ్చి "వీణ్ణి కొత్త రకంగా రాగింగ్ చేయాలిరా" అంటూ నా దగ్గరికి వచ్చాడు.



"అటుచూడు" అంటూ అమ్మాయిల గ్రూపును చూపించాడు. నేను అటువేపు తిరిగిచూశాను.

నా పక్కనున్నతను అందులోని ఒక అమ్మాయిని చూపించాడు. నేను చూశాను.

"ఆ అమ్మాయిని చూశావుగా. వెళ్ళి ఆమె చేయి పట్టుకొని కాసేపు కాలేజీ ఆవరణంతా తిరుగు. చేయి మాత్రం వదలి పెట్టకూడదు. బైదిబై ఆ అమ్మాయి పేరు అడగడం మరచిపోవద్దు" అంటూ నన్ను ముందుకు నెట్టాడు.

వాళ్ళు చెప్పినట్టు వినకపోతే ఏం చేస్తారో నన్న భయంతో వెళ్ళాను.

ఆమె దగ్గరగా వెళ్ళి ఏం మాట్లాడకుండా ఆమె చేయి పట్టుకున్నాను. నన్ను ఏమీ అనకుండా చిరునవ్వులు చిందిస్తూ నావెంట కలిసి కాలేజీ ఆవరణ అంతా కలిసి తిరిగింది.

సీనియర్లు కేరింతలు కొడుతూనే ఆ అమ్మాయి ప్రవర్తనకు ఆశ్చర్యపడుతున్నారు.

"జంట" బాగుందని కొందరన్నారు.

నేను తిరిగి వాళ్ళ దగ్గరకు వచ్చి "ఆమె పేరు సౌందర్య" అని చెప్పాను.

వాళ్ళు ఆశ్చర్యంగా నావంక చూసి "ఏంటోయ్! జోకు లేస్తున్నావా? అసలు నువ్వు ఆమెతో మాట్లాడినట్టే అన్పించలేదు. ఆమెపేరు నీకెలా తెలుసు?" అడిగారు.

"ఆమె పేరు నాకెప్పట్నుంచో తెలుసు. ప్రతిరోజూ ఆమె, నేనూ కలిసి తిరుగుతూ ఉంటాం! ఎందుకంటే ఆమె, నేనూ కవలలుగా ఒకే తల్లి కడుపున పుట్టాం కాబట్టి" అన్నాను.

అంతే మా సీనియర్లంతా అవాక్కయిపోయారు.

-టి.నీలం సంజీవ్,
బి.ఎస్సీ (రెండో సంవత్సరం)
మధుమలాంచ డిగ్రీ కాలేజీ
బోధన్.